ప్రేమస్వరూపులారా!

ఈ జగత్తులో ఎన్నో బాధలు, కష్టములు, నష్టములు, దుఃఖములు వున్నవని భావించి జనులు చాలా విచారిస్తుంటారు. కాని, ఇవేవీ లేవు. ఉన్నదంతయూ ఆనందమే.

బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్వమస్యాదిలక్ష్యమ్
ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం..

జగత్తంతయూ భగవత్ సృష్టియే. క్రిమికీటకాదులు మొదలుకొని పశుపక్షిమృగాదులు, మానవుల వరకు అంతా భగవత్ సృష్టియే. భగవంతునిచే సృష్టించబడినవి కనుక ఇవన్నియూ ఆనందమునుండియే ఆవిర్భవించినవి. బాధలు, దుఃఖములు, కష్టములు యివన్నీ కేవలం మానవునియొక్క యిమేజినేషన్. మనం వేటినైతే బాధలు అని భావిస్తున్నామో అవి నిజానికి మనకు ఆనందమునందించే నిమిత్తమై ఏర్పడినవేగాని, దుఃఖము నందించే నిమిత్తం కాదు. pleasure is an interval between two pains. బాధలు లేకుండా ఆనందము మనకు ప్రాప్తించదు. కనుక, మనము ఏది వచ్చినా 'ఇదంతా భగవత్ ప్రసాదము' అని ఆనందంగా స్వీకరించాలి. 'ఇది కష్టము, బాధ, నొప్పి' అని మనం భావించరాదు. కడుపులో పుట్టిన బాధను నివారించే నిమిత్తం డాక్టరు ఆపరేషను చేస్తాడు. ఒకవిధంగా ఆ డాక్టరు పెట్టింది కూడను బాధనే కదా! అయితే, ఆ పెట్టిన బాధ వల్లనే ఈ పుట్టిన బాధ పోతుంది. కనుక, కష్టములనుంచే మన దుఃఖము నివారణ అవుతుంది.

లోకంలో కోట్లాది ప్రాణులున్నాయి. ఇవన్నీ ఒకే ఆత్మనుంచియే ఆవిర్భవిస్తున్నాయి. అందరియందు వున్నది భగవంతుడు ఒక్కడే. రామా, కృష్ణా, అల్లా, జీసస్ అని వేరువేరు పేర్లు పెడుతున్నారుగాని, ఉన్నది ఒక్కటే. అదే ఆత్మ. ఈ ఆత్మకు నిజమైన పేరు ప్రేమ. ప్రేమ ఒక్కటి వుంటే అది ఎన్ని బాధలనైనా నివారణ గావిస్తుంది. ప్రేమ గలవానికి కష్టమనేది కలుగదు. మీరందరూ అమెరికానుంచి యింతదూరం వచ్చారు. దేనివల్ల? నాపైనున్న ప్రేమవల్ల వచ్చారు. ఆ ఒక్క ప్రేమను కలిగి వుంటే సర్వమూ మన వశమవుతుంది.

దేవునికి ఒక ప్రత్యేకమైన పేరు లేదు. 'ఆత్మ' అని అంటారు. ఆత్మ అనగా ఏమిటి? ప్రేమయే. ఆ ప్రేమయే అందరినీ కలుపుతుంది. ఎప్పుడు మీరు యూనిటీతో వుంటారో అప్పుడే ప్యూరిటీ వస్తుంది. ప్యూరిటీ ఎప్పుడు వస్తుందో అప్పుడే మీలో ఆత్మతత్త్వమనే డివినిటీ ఆవిర్భవిస్తుంది. కనుక, డివినిటీకి మొట్టమొదట యూనిటీ కావాలి. I and you are one. God and you are one.

భగవంతుడు మిమ్మల్ని వదలి ప్రత్యేకంగా లేడు. 'నేనే దేవుడు' అనే భావము మీలో ఆవిర్భవించాలి. ప్రతి ఒక్కరూ 'నేను, నేను..' అంటారు. ఈ 'నేను' అనదే అందరిలోనున్న ఏకత్వము. ఆ ఏకత్వములో వున్నటువంటి ఆనందము అంతా ఇంతా కాదు. ప్రేమయే దైవం. ప్రేమలో జీవించాలి. అదే ఈనాడు మనం నేర్చుకోవలసినది. అందరూ దైవముయొక్క బిడ్డలే. తల్లి తన బిడ్డలను ప్రేమించినట్లుగా దైవము అందరినీ ప్రేమిస్తున్నాడు. ఒకరిపైన ద్వేషము, మరొకరంటే యిష్టము... ఈవిధమైన భేదాలు దైవానికి లేవు. దైవము ఎవ్వరినీ కష్టపెట్టడు, నొప్పించడు. నీనుంచి దైవము ప్రత్యేకంగా లేడు. నీవెక్కడున్నావో అక్కడే వున్నాడు, నిన్ను వదలి క్షణమైనా ప్రక్కకు పోడు. అసలు దైవము లేని స్థానమే లేదు. ఎక్కడ చూచినా వున్నది దైవమే. మీరందరూ దైవస్వరూపులే. మనకున్నవి రెండే రెండు కన్నులు. కాని, అవి ఇంతమంది జనులను చూడగలుగుతున్నాయి కదా! అదేరీతిగా, దైవము ఒక్కడే అయినప్పటికీ అందరినీ చూస్తుంటాడు. where is God? he is in you, with you, above you, below you. కనుక, దైవాన్ని మనం ప్రత్యేకంగా వెతుకనక్కరలేదు. మీరు కేవలం భౌతిక దేహంపై దృష్టిపెట్టటంచేత ఈ భేదములంతా గోచరిస్తున్నాయి. కాని, భౌతిక దేహాన్ని మీరు ఆధారం చేసుకోకూడదు. body is like a water bubble, mind is like a mad monkey. పిచ్చి మనస్సు తన యిష్టము వచ్చినట్లు తిరుగుతుంది. అది ఒక నిముషం ఒక చోట వుంటుంది, రెండవ నిముషం మరోచోటికి పరుగెత్తుతుంది. స్థిరమైనది, శాశ్వతమైనది ఒక్కటే. అదే 'నేను'. కాబట్టి, 'నేనే దైవం, నేనే దైవం' అనే భావం మీలో స్థిరంగా పెట్టుకోండి. దేవుడెక్కడ అనే ప్రశ్నకు అదే సరైన జవాబు.

ఎన్ని భజనలు చేసినా, ఎన్ని జపములు చేసినా, ఎన్ని తపములు చేసినా మనము ప్రేమను ప్రధానంగా పెట్టుకోవాలి. ప్రేమ ఒక్కటి వుంటే ఇంక ఏ సాధనా చేయనక్కరలేదు. ప్రేమ లేనప్పుడు ఎన్ని సాధనలు చేసినా ప్రయోజనం లేదు. కాబట్టి, మీ మనస్సులో ప్రేమను నింపుకోండి. ప్రేమలో జీవించండి. ఇదే మీరు చేయవలసిన సాధన. 'ప్రేమ ముదిత మనసె కహో రామ రామ రామ్..' భౌతికమైన సంబంధబాంధవ్యములు వస్తుంటాయి, పోతుంటాయి. ఇవన్నీ కదలిపోయే మేఘాలు. ఇవన్నీ మీ మానసిక భావములయొక్క రిఫ్లక్షన్, రియాక్షన్, రీసౌండ్‌లు మాత్రమే. (భగవాన్ తమ చేతిరుమాలు చూపిస్తూ) ఇది ఒక వస్త్రము. ఇది వస్త్రము కాదు. దారములయొక్క చేరిక. ఇవి దారములు కావు. ఇది ప్రత్తి. ఇది దైవముయొక్క సృష్టి. ఈ సృష్టిలో భగవంతుడు మీకు అనేక దారములను అందించాడు. వాటిని మీరు ఇష్టమువచ్చినట్లు అల్లుకుంటున్నారు. మీ ఇష్టం కాదు ముఖ్యం, దైవానికి ఏది యిష్టమనేది ముఖ్యం.

దేహము, మనస్సు మార్పుచెందుతాయి. కాని, ప్రేమకు మార్పు లేదు. ఏదానికైననూ జనన మరణములున్నాయిగాని, ప్రేమకు జననమూ లేదు, మరణమూ లేదు. జనన మరణములు లేనిది ప్రేమ ఒక్కటే. భగవంతుడు ప్రేమస్వరూపుడై మీలోనే వున్నాడు. మీ

శ్వాసయే మీయొక్క దైవం. అది ఎట్లా వస్తుంది? 'సో...హమ్, సో..హమ్' అనే సందేశముతో వస్తున్నది. 'సో' అనగా అది, దైవం. 'హం' అనగా నేను. కాబట్టి, 'సోహం' అనగా అది నేనే. అదే ప్రేమ. కనుక, ఆ ప్రేమనే మనము ప్రధానంగా పెట్టుకోవాలి. మిగిలిన ఆలోచనలు వస్తుంటాయి, పోతుంటాయి. కాని, ఎల్లప్పుడు స్థిరంగా వుండేది ప్రేమయే. కాబట్టి, ప్రేమతో మీరు ఏపనైనా చేయండి. మీ శత్రువు వచ్చినా ప్రేమతే 'హలో!' అనండి. వాడుకూడా 'హలో!' అంటాడు. ఇదే రీసౌండ్, రిఫ్లక్షన్, రియాక్షన్'. మనం ఏమి చేస్తున్నామో, అది మంచిగాని, చెడ్డగాని మనకే తిరిగి వస్తుంది. కనుక, మనము నిరంతరం ప్రేమలో మునిగి వుండాలి. ప్రేమ ఒక్కటి వుంటే దేనినైనా సాధించవచ్చు. ఎన్ని ఘనకార్యములైనా సాధిస్తుంది. ఈ ప్రపంచమంతటినీ సృష్టించినది ప్రేమయే. నడిపించేదీ ప్రేమయే. కనుక, ప్రేమకు మించినటువంటి దైవము మరొకటి లేదు. ప్రేమ లేకుండా మీరు ఎంత సాధన చేసినప్పటికీ అది నిరర్థకం. కనుక, హృదయంలో ప్రేమను పెట్టుకోండి. ఆ ప్రేమయే అందరినీ ఆకర్షిస్తుంది. ప్రేమయే సర్వమును సమకూరుస్తుంది. సృష్టించునదీ ప్రేమయే, భస్మము చేయునదీ ప్రేమయే, శిక్షించునదీ ప్రేమయే. నీవు భౌతిక దృష్టితో చూడటం వల్ల'ఇది సృష్టి' అని అనుకుంటున్నావు. కాని, ఉన్నది ఒక్కటే. అదే ప్రేమ. అది మాత్రం ఏమాత్రమూ మార్పు చెందదు. ఆ ప్రేమ మార్గాన్ని అనుసరిస్తే సర్వసాధనలూ చేసిన ఫలితం వస్తుంది.

భగవంతునికి అనేక పేర్లు పెడుతున్నారు. కాని, ఏ పేరుతో పిలిచినా పలికేది ఒక్కడే. 'అల్లా' అని పిలచినా 'యెస్' అంటాడు, 'జీసస్' అని పిలచినా 'యెస్' అంటాడు, 'రామా' అనిపిలచినా 'యెస్' అంటాడు. ఇవన్నీ పెట్టిన పేర్లేగాని పుట్టిన పేర్లుకావు. దైవంయొక్క అసలైన పేరు ఒక్క ప్రేమ మాత్రమే. ఏ డిక్షనరీలో అయినా చూచుకో, ఉన్నది ఒక్క ప్రేమ, రెండు ప్రేమలు లేవు. దేహాన్ని బట్టి 'రిలేషన్‌షిప్స్' రెండు మూడు విధాలుగా వుండవచ్చును. ఒక వ్యక్తిని భర్తగా భావిస్తావు. మరొక వ్యక్తిని కొడుకుగా భావిస్తావు. మూడవ వ్యక్తిని తండ్రిగా చూస్తావు. కాని, ఇవన్నీ కేవలం శారీకమైన సంబంధముతో ఏర్పడినవి. ఈ 'రిలేషన్‌షిప్స్' ఎవరు పెట్టినవి? మీరు పెట్టుకొన్నవే. కాబట్టి, అవి మార్పుచెందుతాయి. నిజమైన ప్రేమకు మార్పు లేదు. అట్టి ప్రేమతో 'రామా' అను, 'కృష్ణా'అను, 'అల్లా' అను, 'ఈశ్వరా' అను, 'జీసస్' అను ఏ పేరుతో పిలిచినా తాను పలుకుతాడు. ఒకరు 'రామా ఈజ్ మై గైడ్' అంటారు. 'కృష్ణా ఈజ్ మై గాడ్' అంటారు మరొకరు. ఇంకొకరు 'సాయి ఈజ్ మై గాడ్' అంటారు. కేవలం పేర్లు వేరువేరుగాని, భగవంతుడు ఒక్కడే. బియ్యం రుబ్బి దోశలు చేస్తాము, ఇడ్లీలు చేస్తాము. దానిలో కొంచెం చెక్కర కలిపి పాయసం చేస్తాము. కాని, బియ్యం ఒక్కటే కదా! అదేవిధముగనే, దైవము ఒక్కడే. ఆయన ప్రేమస్వరూపుడు. ఆ ప్రేమతో మీరు ఏ కార్యమైనా చేయండి. తప్పక సత్ఫలితాన్ని పొందుతారు.

మీరు ఒకరినొకరు 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్' అని పిలుచుకుంటారు. ఐతే, 'బ్రదర్స్' వేరే లేరు, 'సిస్టర్స్' వేరే లేరు. భౌతికంగా వేరువేరుగా కనిపించవచ్చు. అది మీరు పెట్టుకున్నటువంటి 'రిలేషన్‌షిప్' మాత్రమే. అందరూ ఒక్కటే. మీరు భిన్నత్వము ఏమాత్రమూ చూడకూడదు. దైవము ముసలివానిలో వున్నాడు, చిన్నబిడ్డలోకూడా వున్నాడు. దైవానికి వయస్సే లేదు. దైవానికి ఎట్టి రూపమూ లేదు. కేవలం ప్రేమ, ప్రేమ, ప్రేమ. కనుక, మీరు ప్రేమను హృదయపూర్వకంగా పెంచుకోండి. అప్పుడే మీకు ఆనందము కలుగుతుంది. మనలో ప్రేమ వుండినంతవరకు మనము ఆనందానికి దూరం కాము. కాని, మీరు భేదములు పెంచుకుంటున్నారు. ఏకత్వాన్ని విశ్వసించండి. అప్పుడు మీరు ఎన్ని సంబంధబాంధవ్యాలు పెట్టుకున్నప్పటికీ వాటి విలువపెరుగుతూనే వుంటుంది. ఒకటి పెట్టి దాని తరువాత జీరో పెట్టు, అది పది అవుతుంది. ఇంకొక జీరో పెట్టు, దానివంద అవుతుంది. వేలకొలది జీరోలు పెట్టు, దాని విలువ పెరుగుతూనే వుంటుంది. కాని, ఆ ఒకటి తీసేస్తే మిగిలేవి జీరోలే. అదేవిధంగా, దైవం ఒక్కడే అనే సత్యాన్ని విశ్వసించి ఏ పేరుతోనైనా పిలవండి, ఎన్ని నామాలైనా ఉచ్ఛరించండి.

'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి' ఇది వేద ప్రమాణము. హృదయంలో ప్రేమను నింపుకొని మీరు ఏ దేశమైనా వెళ్ళండి, ఏ నామమైనా తలుచుకోండి, ఏ సాధనైనా చేయండి. ఎవ్వరినీ ద్వేషించకండి. 'హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్'. ఇదే భక్తులైన వారు టేయవలసిన పని. 'నేను భక్తుడను' అని చెప్పుకుంటూ, 'అతను నా వాడు, నీవు నావాడవు కాదు' అన్నటువంటి భేదము పెట్టుకోకూడదు. ఎవరిని ద్వేషించినా దైవాన్నే ద్వేషించినట్లవుతుంది. ఎక్కడికి పోయినా God is in me, with me, around me, అని విశ్వసించాలి. ఎక్కడ చూచినా వున్నది దైవము ఒక్కడే. ఆవిధమైన ఏకత్వ భావనను విశ్వసించండి. మీకు ఎంతైనా ఆనందము కలుగుతుంది. మీరు ఎన్నో దేశములనుండి వచ్చారు. మీ రూపములు వేరు, నామములు వేరు, దేశములు వేరు. కాని, ఇక్కడ మాత్రం అందరూ ఒక్కటే. ఇట్టి ఏకత్వ భావనతో మీరందరూ నేటినుండి ఆనందంగా వుండండి.

'ఈ రోజు నా పుట్టినరోజు' అంటావు. పుట్టినరోజు దేనికి? అది కేవలం దేహము పుట్టిన దినము. దేహము ఈ రోజు పుడుతుంది, రేపు పోతుంది. కాని, నీవు ఎప్పటికీ వున్నావు. నీవు పుట్టటం లేదు, పోవటం లేదు. ఎల్లప్పుడూ ఆనందంగా వుండండి. ఇదే నేను మీనుండి ఆశించేది. 'నాది, నీది' అనే భేదము ఏమాత్రము రానివ్వకండి. మీరింతసేపు ఇక్కడ భజన చేశారు. ఇన్ని కంఠములు చేరి ఒక్క స్వరంగా పాడటం ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ ఏకత్వమే దైవత్వము. కనుక, 'యూనిటీ' వుండాలి. 'యూనిటీ' వచ్చినప్పుడే 'ప్యూరిటీ' వస్తుంది. 'ప్యూరిటీ'యే 'డివినిటీ'ని ఆకర్షిస్తుంది. మీరు ధరించిన తెల్లని దుస్తులు పవిత్రతకు చిహ్నం. మీరు వేసుకున్న డ్రస్సుకు తగినట్లుగా మీ హృదయంకూడా పవిత్రంగా వుండాలి. తెల్లని డ్రస్సు ఏకత్వాన్ని, పవిత్రతను ప్రతిబింబిస్తుంది. అట్లుకాకుండా, ఒక్కొక్కరు ఒక్కొక్క కలర్ డ్రస్సు వేసుకుంటే కేవలం భిన్నత్వం గోచరిస్తుంది. మనలో భిన్నత్వం రాకూడదు. డ్రస్సులో కాని,

మనస్సులోగాని అందరూ ఏకత్వంతో కూడి వుండాలి. అందరూ ఒక్కటే, ఒక్కటే, ఒక్కటే! కనుక, మీరందరూ ఏకత్వంతో, ప్రేమతో, అన్యోన్యంగా, ఆనందంగా జీవించండి.

భజన బినా సుఖశాంతి నహీ.....

భజన మన భోజనము. అది లేకపోతే ఆకలి వేస్తుంది. కనుక, మన ఆధ్యాత్మిక ఆకలి తీరాలంటే నిత్యమూ, క్షణక్షణమూ భజన చేయాలి. తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుందునంతవరకు, మనకు ప్రజ్ఞ వున్నంత వరకు భజన చేస్తూ వుండాలి. ఇదే ఈనాడు నేను మీకందించే సందేశం. మీరు ఏ పని చేసినా మనస్సులో భగవంతుని నామస్మరణ చేస్తూ వుండండి. God is within you, without you, beyond you, below you and behind you.

( 2007 డిసెంబరు 15వ తేదీ సాయంత్రం సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)